జగనన్నతోనే సామాజిక సాధికారిత

- వైసీపీ బస్సు యాత్ర విజయవంతం చేయాలి
- రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాలకి వైసీపీ ప్రభుత్వంలో దక్కిన ప్రాతినిధ్యం ప్రజల్లోకి నేరుగా తీసుకుని వెళ్లాలని, వారిని చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశ్యం తో సామాజిక సాధికార యాత్ర చేపడుతున్నామని జిల్లా వైసీపీ అధ్యక్షులు కృష్ణ దాస్, రాష్ట్ర మంత్రి డా. సీదిరి అప్పలరాజు లు అన్నారు.ఆదివారం ప్రగతి భవన్ ఆవరణలో వైసీపీ బస్ యాత్ర విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ప్రతిపక్షం మన మీద బురదజల్లుతుందని, బిసిల పార్టీ,ఎస్సిల పార్టీ అని ప్రతిపక్షం చెప్పుకుంటోందని కానీ వాస్తవానికి బిసి,ఎస్సీ,ఎస్టీలకు మేలు చేసినది జగనన్న ప్రభుత్వం అని అన్నారు.చంద్రబాబు హయాంలో ఒక్క మైనారిటీకి కూడా తన క్యాబినెట్ లో చోటు కల్పించలేదంటే ఆయన ఆలోచనలు మనం అర్థం చేసుకోవాలని కోరారు. చంద్రబాబు అన్ని సందర్భాలలో బడుగు,బలహీన వర్గాలను దూషించాదని, గిరిజనులకు ఆయన క్యాబినెట్ లో అవకాశం కల్పించ లేదన్నారు. చంద్రబాబు ఆధునిక అంటరాని తనాన్ని ప్రోత్సహించాడని ప్రతి కార్యకర్త కూడా గమనించాలని అన్నారు.

.ప్రభుత్వ రంగ సంస్థలకు ఎవరు వెళతారు పేదలే కదా వెళతారంటూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా భ్రష్టు పట్టించేశాడని అన్నారు. విద్య, వైద్యం, ప్రభుత్వ కార్యాలయాలను సైతం ప్రయివేటు పరం చేసే ఆలోచనలు చంద్రబాబు చేశాడని అన్నారు.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత విద్య,వైద్యం ప్రతి పేదవాడికి అందాలనే ఉద్దేశంతో పని చేశారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పేదల కోసం పనిచేసేలా ప్రతి రెండు వేల మందికి ఒక సచివాలయం నిర్మించి గ్రామ పరిపాలన దిశగా అడుగులు వేశారని అన్నారు.దీన్నే సామాజిక సాధికారత అంటారని వారు తెలిపారు.ప్రతి అంశాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్ళలానే ఉద్దేశంతో సామాజిక సాధికార యాత్ర ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబర్ 3 వ తేదీ నాడు పలాసలో జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని కార్యకర్తలను, నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకట్రావులతో పాటు మూడు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల ద్వారా సుపరిపాలన

- ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన గ్రామ సచివాలయ వ్యవస్థ పరిపాలనలో ప్రజానీకానికి చేదోడు వాదోడుగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులో లభిస్తున్నాయన్నారు. అదివారం సరుబుజ్జిలి గ్రామంలో సుమారు 40 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాల సముదాయాన్ని ప్రారంభించారు. 21.80 లక్షల అంచనాలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామం సర్వాంగ సుందరంగా రూపు దిద్దించడమే తన అభిమతన్నారు. సరుబుజ్జిలి మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి

చేశానన్నారు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లో రైతులకు మేలైన సాగుకు రైతు భరోసా కేంద్రాలు సాయంగా నిలుస్తున్నాయన్నారు. పంట ప్రారంభ కాలంలో విత్తనాలు, ఎరువులు వంటివి రైతులకు సబ్సిడీతో కూడిన ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. పంటకు మెరుగైన మద్దతు ధర కూడా ఆర్ బి కే ల ద్వారా దక్కుతున్నాయన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులు కొత్త రూపును సింగారించుకుంటున్నాయన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వెల్నెస్ సెంటర్ల ద్వారా ప్రాథమిక వైద్యం ప్రజలకు అందుబాటులో లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఎంపీపీ ప్రతినిది కేవిజి సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ శివానంద బాబు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, జిల్లా పార్టీ కన్వీనర్ బాన్నా రాము, బీసీ సెల్ డైరెక్టర్ ముదడ్ల రమణ, ఎస్ సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, మండల మహిళా అధ్యక్షురాలు బొడ్డేపల్లి చామంతమ్మ, స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సూర్య చాందిని, స్థానిక ఎంపీటీసీ ఇల్లాకుల సూర్యప్రకాశ్, స్థానిక నాయకులు బొడ్డేపల్లి హరి తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో సమసమాజం నిర్మాణం

- క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: క్రీడలలో ప్రవేశం ద్వారా క్రమశిక్షణ కలిగిన ఒక మంచి సమసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. క్రీడలను ప్రభుత్వాలతోపాటు దాతలు, ప్రోత్సాహకులు, ప్రైవేటు వ్యక్తులు ప్రోత్సా హించిననాడే క్రీడల అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్, తైక్వాండో ఛాంపియన్ షిప్-2023 పోటీలు ఎంతో ప్రతిష్టాత్మకంగా, కన్నుల పండుగగా జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ధర్మాన ప్రసాదరావు తొలుత స్వర్గీయ కొన్న చిన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటముల కంటే పోటీల్లో ప్రాతినిధ్యం వహించడమే ముఖ్యమనే విషయాన్ని ఎన్నడూ మరవకూడదన్నారు. దశాబ్దంన్నర నుంచి తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కొన్న చిన్నారావు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈనాడు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులు ఆదర్శంగా నిలుస్తారని చెప్పడానికి కొన్న వాసు, అతని మిత్రబృందం ఉదాహరణగా చెప్పవచ్చని అన్నారు. గత 16 ఏళ్లుగా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న స్వర్గీయ కొన్న చిన్నారావు కుటుంబం సభ్యులు తమ తండ్రి ఘన నివాళులు అర్పిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

- జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరు... కాగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్, తైక్వాండో పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. అద్భుతమైన ప్రతిభా నైపుణ్యాన్ని కనబర్చారు. బాలబాలికలకు వేరువేరుగా నిర్వహించిన ఈ మీట్ లో పలువురు క్రీడాకారులు ఎంతగానో ఆకట్టుకున్నారు. వివిధ విభాగాల్లో విజేతలగా నిలిచిన బాలబాలికలకు పతకాలు, ప్రసంశా పత్రాల అందజేశారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్, బీజేపీ అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూధనరావు, బిజేపీ యువమోర్చ నాయకులు పూడి బాలాదిత్య, డాక్టర్ పి. సురేఖ, తుడా పీవో పీజీ రామ్మోహన్ రావు, డీటీసీపీవో డి. కిషోర్ కుమార్, శివాని కాలేజ్ డైరెక్టర్ సనపల నర్సింగరావు(రాజా), చీఫ్ కోచ్ డాక్టర్ శ్రీధర్ రావు, నౌపడ విజయ్ కుమార్, వాండ్రంగి శ్రీనివాసరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, తైక్వాండో శ్రీను, వేణుగోపాల్, డీఎస్పీ, నేషనల్ అథ్లెట్ డి.కోటేశ్వరరావు, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, ఎస్జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, కె.హరిబాబు, కె.మాధవరావు, వై.పోలినాయుడు, పీడీలు, పీఈటీలు, కోచ్ లు, కొన్న చిన్నారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నాశనం చేస్తున్న 117 ఉత్తర్వులు రద్దు చెయ్యాలి

- జీపీఎస్ మాకొద్దు
- ఎస్టీ యూ నాయకులు డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రభుత్వ విద్యారంగానికి భ్రష్టు పట్టించే 117 ఉత్తర్వులు రద్దు చేయాలని, జీ పీ ఎస్ ను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీ యూ) వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకర రావు అన్నారు. స్థానిక కా.ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పడాల తమ్మి నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర రావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉత్తర్వులు సంఖ్య 117 తీసుకొచ్చి ఐదు సంలో ఉపాధ్యాయులను, పాఠశాలలను 50శాతం తగ్గించాలని ఒక తిరోగమన ప్రణాళికతో ఉందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రాప్తికి ప్రభుత్వపాఠశాలలు మూసివేసి, ఉపాధ్యాయులను తీసివేసే కార్యక్రమంలో ఉందని, ఈ దుర్మార్గమైన ఉత్తర్వు వలన నాడు నేడులో లక్షల రూపాయల ఖర్చు పెట్టిన పాఠశాలలు కూడా మూసివేసే పరిస్థితి వచ్చిందని వాపోయారు. ఈ ఉత్తర్వులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. పడాల తమ్మి నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమ పాదయాత్రలో సామాజిక భద్రతలేని సిపిఎస్‌ను రద్దు చేస్తామని డిఏలు బకాయిల వలన ఉపాధ్యాయులు బ్రతుకు దయనీయంగా మారిందని చెబుతూ, తీరా అధికారంలోకి రాగానే ప్రభుత్వం మాట మార్చి, మడం తిప్పి సిపిఎస్ కంటే ఎక్కువ నష్టం కలిగించే జిపిఎస్ ను తీసుకురావడం ప్రభుత్వం వాటా అయిన 14 శాతాన్ని ఎగ్గొట్టే దురుద్దేశం దాగి ఉందన్నారు. దీన్ని ఎస్టీ యూ వ్యతిరేకిస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వి రమణమూర్తి మాట్లాడుతూ ఒకవైపు దీర్ఘ కాలంగా ఉద్యోగులు దాచుకున్న డబ్బును ఉద్యోగుల అవసరాలకు ఇవ్వకుండా

ఇబ్బంది గురి చేస్తూ డీ నికి బోనస్ గా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నమాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆర్థిక అవసరాలు తీరక పని భారం పెరిగి పాఠశాల విద్య ను ఒక ప్రయోగశాలగా మార్చి బోధనకు అరకొర సమయం ఇస్తూ, ఐ ఎఫ్ పీ, సీ బీ ఎస్ ఈ, ఐబీ మరియు టోఫెల్ లాంటి ఆచరణ సాధ్యం కానీ గందరగోళ విధానాలతో ప్రభుత్వం గాలి మేడలు కట్టి విద్య రంగాన్ని ఉన్న స్థితి కంటే దిగజార్చిందన్నారు. మరొవైపు కేంద్ర ప్రభుత్వం మెమో నెంబరు 57/ 2000 ద్వారా 2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి నియామకమైన 2003 డిఎస్సి ఉపాధ్యాయులను పాత పెన్షన్ స్కీములోకి తీసుకురమ్మని ఆదేశాలు ఇచ్చినా, అమలు చేయకుండా ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంబిస్తుందన్నారు. ఉపాధ్యాయ వ్యవస్థలో ఎంటీఎస్ విధానాన్ని రద్దుచేసి 1998,2008 డీఎస్సీ వారిని బేషరతుగా రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సన్యాసిరావు, నాయకులు గురుగుబెల్లి రమణ, ఇందిర, గురువు శ్రీను, మొయ్యి తేజేశ్వరరావు, గోవిందరావు, బొడ్డేపల్లి సత్యం, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ప్రజలకు ఏం సామాజిక సాధికారత కల్పించారు

- ఎమ్మెల్యే అశోక్‌కు ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ సూటి ప్రశ్న

విశాలాంధ్ర-కవిటి: వైసిపి పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సామాన్యాయం కల్పించామని మీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏం సామాజిక సాధికారిత కల్పించారని ఎమ్మెల్యే అశోక్ కు మండల ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ తోపాటు పలువురు వైసీపీ నాయకులు సూటిగా ప్రశ్నించారు.ఈ మేరకు ఆదివారం మండల కేంద్రమైన కవిటిలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.ఈనెల 26వ తేదీన ఇచ్చాపురంలో జరిగిన సామాజిక సాధికారిత యాత్ర విజయవంతమైన నేపథ్యంలో నియోజక వర్గ టిడిపి నాయకులకు గుబులు మొదలైందని అన్నారు.ఇచ్చాపురం నియోజకవర్గం శాసన సభ్యులు బెందాలం అశోక్ నాలుగున్నర ఏళ్లలో కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించలేక పోయారని అన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు విలాసాలకు, కాలక్షేపానికి వినియోగించుకున్నారే తప్ప ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల సమస్యలు పై ఏనాడు పట్టించుకోని దాఖలాలు లేవని అన్నారు. ఇచ్చాపురం నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యల్లో కిడ్నీ వ్యాధి అత్యంత తీవ్రంగా ఉండి ప్రజలు ప్రాణాలు కోల్పోయే సందర్భంలో అలాగే రోగాల బారిన పడిన వారికోసం గాని ఎటువంటి

నివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని ఇచ్చాపురం నియోజకవర్గంకు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీలు అవినీతికి పాల్పడిన మీరా మమ్మల్ని విమర్శించేదని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో మీరు ప్రాతినిధ్యం వహించిన పంచాయతీల్లో కనీసం సర్పంచ్ పదవిని గాని ఎంపీటీసీలకు గాని గెలిపించలేకపోయారు మీరా మమ్మల్ని విమర్శించేది, ఇచ్చాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుస్తామని ఛాలెంజ్ చేసేదని ఎద్దేవా చేశారు. వైసిపి పాలనలో 700 కోట్లతో మెగా త్రాగునీటి ప్రాజెక్టు,150 కోట్లతో 200 పడకల కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి ఈ నియోజకవర్గంపై ప్రేమ అభిమానం చూపించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మీరా విమర్శించేదని ప్రశ్నించారు. ఈరోజు భారతీయ సమాజంలో స్త్రీలకు అత్యంత గౌరవంగా చూసే సాంప్రదాయంలో భాగంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి బిసి కులానికి చెందిన మహిళను జిల్లా పరిషత్ చైర్పర్సన్గా పదవి ఇచ్చి మన నియోజకవర్గంకు గౌరవించిన ముఖ్యమంత్రిని కించపరిచేలా మాట్లాడటం సబబు కాదని స్త్రీల పట్ల మీ సంస్కారానికి ఇదే నిదర్శనమని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని సామాజిక వర్గాలు ఉన్న నేపథ్యంలో యాదవ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ,కాలింగ సామాజిక వర్గానికి జడ్పీ చైర్పర్సన్, రెడ్డిక సామాజిక వర్గానికి కార్పొరేషన్ చైర్మన్, ఎస్సీలకు డీసీఎంఎస్, ఏఎంసి పదవులు ఇచ్చి సమన్యాయం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తమరు కించపరిచేదని ప్రశ్నించారు.ఇది కాదా సామాజిక సాధికారిక అని అన్నారు.ఇకనైనా చిల్లర మాటలు మానుకొని తమరు అధికారంలో ఉన్న కాలంలో ఈ కులాలకు ఏం సాధికారిక కల్పించారు చెప్పగలరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల కోప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఎంపీటీసీ పూడి నీలాచలం, ఏఎంసి ఉపాధ్యక్షుడు నీలయ్య, మాజీ పిఎసిఈఎస్ అధ్యక్షులు శ్రీరాములు, యుగంధర్, దువ్వ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 10న చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్ష : ఎంఈఓ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్ష, నవంబర్ 10 ఉంటుందని అదనపు ఎం ఈ ఓ అర్జునుడు అన్నారు. ఈ మేరకు సంతబొమ్మాళి మండల విద్యాశాఖ అధికారి-2 డి.అర్జునుడు ఆవిష్కరిస్తూ, మండలంలో గల అన్ని యాజమాన్యాలలో ఉన్న 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థులచే పరీక్ష నిర్వహించి, శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించవలసినదిగా ప్రధానోపాధ్యాయులను కోరారు. జెవివి జిల్లా అధ్యక్షులు కుప్పిలి.కామేశ్వరరావు %శ్రీ% మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుండి చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా ఈ ఏడాది కూడా పాఠశాల స్థాయిలో నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న. నిర్వహించటం. జరుగుతుందని అన్నారు. అలాగే జిల్లాస్థాయిలో డిసెంబర్ 17న, రాష్ట్ర స్థాయిలో 27, 28 జనవరి, 2024 తేదీలలో ఈ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బారాటం.కామరాజు, యూటిఎఫ్ నాయకులు గణపతిరావు, పాపారావు, లాఖినాన వెంకటరమణ, రమణ, వెంకటేష్, శివప్రసాద్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

- ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల:అన్నదానం మహాదానం తో సమానం అని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల ముగింపు ఉత్సవాలు పురస్కరించుకొని సూర శ్రీనివాస రావు, సరితారాణి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విలువలు కలిగి భక్తిశ్రద్ధలతో మెలగాలన్నారు. దుర్గామాతను భక్తితో పూజించిన వారికి ఎల్లప్పుడూ శుభం కలుగుతుందని చెప్పారు. అన్నదానం కోటి గోవుల దాన ఫలితంతో సమానమైనదని చెప్పారు. ఏది లోపించినా బ్రతకగలం....కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేం అన్నారు. "దానాలన్నింటిలో కెల్లా అన్నదానం మిన్న" అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని పెద్దలు చెప్తారన్నారు. మనిషి ఆశకు అంతులేదని... అదుపు అంతకన్నా ఉండదని ఎందుకంటే ఏది దానంగా ఇచ్చినా... ఎంత ఇచ్చినా కూడా ఇంకా ఇంకా కావాలనిపిస్తుందని కానీ అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా లేస్తారని వివరించారు. 2000 మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

టీడీపీ నిరసనకు సీపీఐ నాయకుల సంఘీభావం

విశాలాంధ్ర- కంచిలి : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు కు నిరసన గా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ జగదీష్ పట్నాయక్ ఇంటివద్ద ఆదివారం కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో సీపీఐ ఇచ్ఛాపురం నియోజక వర్గ ఇన్‌చార్జీ సాలిన నారాయణ స్వామి, జనసేన నాయకులు లింగభారి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొని టీడీపీ నిరసనకు వారి సంఘీభావం తెలిపారు.

ఫోటో: టీడీపీ నిరసనకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ: 29ఎస్‌కెఎల్ఎం14

ఎన్ఈఆర్ స్కూల్ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-రణస్థలం: ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ అంతర్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ ఛాంపియన్షిప్ విజేతలకు సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఈఆర్ స్కూల్ అఫ్ ఎక్సెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి పివిజి మురళి కృష్ణంరాజు, జాయింట్ సెక్రెటరీ పీహెచ్ అరుణ్ కుమార్, సెక్రెటరీ అజయ్ కుమార్, స్కూల్ డైరెక్టర్ ఎన్ తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో విజేతలుగా నిలిచిన టీం సభ్యులను టీం సభ్యులను సత్కరించారు. స్కూల్ విద్యార్థులైన జాహ్నవి మరియు హర్షిని ఈ టీములో భాగస్వాములుగా ఉండడం గమనించదగ్గ విషయం. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఈశ్వర్ రావు మాట్లాడుతూ చదువు తోపాటు ఆటలలో రాణించిన విద్యార్థులు మాత్రమే జీవితం విసిరే సవాళ్లను అధిగమించగలరని అన్నారు. జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ రాజు, బాల్ బ్యాట్మెంటన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ త్వరలో ప్రారంభం కానున్నది దానిలో ఒక ఫ్రాంచైజ్ ని స్కూల్ తీసుకోవాల్సిందని ప్రతిపాదించారు. దానికి స్కూలు చైర్మన్ ఈశ్వర్ రావు మరియు స్కూల్ డైరెక్టర్ తేజ అంగీకరించారు. ఈ సందర్భంగా అతిధులను, కోచ్ లను, క్రీడాకారులను ఘనంగా సత్కరించారు.

బస్సు యాత్ర తప్ప రైతుల గోడు పట్టదా..?

విశాలాంధ్ర-పలాస : వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు తమ రాజకీయం, అధికారం కోసం బస్సు యాత్రలు చేస్తున్నారే తప్పా రైతుల గోడును ఎందుకు పట్టించుకోవడం లేదని వామపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పలాస మండలం బొడ్డపాడు, మందస మండలం రఘునాథపురం గ్రామాల్లో ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో కరువు విలయతాండవం చేస్తుంటే అధికారులు, పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్ట పడ్డ రైతులకు కన్నీరే మిగిలాయని, ఎ.సి బస్సుల్లో తిరుగుతున్న మంత్రులకు రైతుల గోడు పట్టదా అని ప్రశ్నించారు. రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పుకొని గద్దెనెక్కిన వైసీపీ నాయకులు గత నాలుగేళ్లుగా పంటకు నీరు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని, కనీసం కాలువల పూడికలు తియ్యకుండా చెరువులు, చెక్‌డ్యామ్ కూడా బాగు చేయసుకొనే దుస్థితి ఉందన్నారు. వంశధార, కళింగదళ్, డబారుసింగు, సంకుజోదు లాంటి ఎన్నో నీటివనరులు ఉన్న ఈ నియోజకవర్గంలో రైతులకు ఈ పరిస్థితి రావడం అంటే అది ముమ్మాటికి రాజకీయ నాయకుల అలసత్వమేనని అన్నారు. ఇప్పటికైనా నాయకులు చొరవ చూపి అధికారులతో సమగ్రమైన నివేదిక తీసుకొని పంట నష్టపోయిన రైతాంగానికి యుద్ధప్రతిపాదికన ఆదుకోవాలని ప్రభుత్వానికి కోరారు. కార్యక్రమంలో చాపర వెంకటరమణ, వంకల మాధవరావు, మద్దిల రామారావు, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, ఎం.వినోద్‌లు పాల్గొన్నారు.

ఉద్దానంలో పెద్దపులి సంచారం

- పెద్దపులి పాదముద్రలు గుర్తింపు తో హడలిపోతున్న ప్రజలు
- ప్రజలను అప్రమత్తం చేసిన ఫారెస్ట్ అధికారులు

విశాలాంధ్ర-కవిటి: ఉద్దాన ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి కవిటి మండలంలో పలు గ్రామాల్లో పులి సంచరించినట్లు కాశీబుగ్గ డివిజన్ అటవీ రేంజ్ అధికారి మురళీకృష్ణ నాయుడు తెలిపారు. పచ్చని పంట పొలాలు ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగిస్తున్న ప్రజలు ఉద్దానం ప్రాంతంలో తోటల్లోనూ పచ్చని పొలాలు,తోటలలో పెద్దపులి పాదముద్రలు ప్రత్యక్షమవడంతో ఉద్దాన ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతూ అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం కవిటి మండలం బెజ్జి పుట్టుగ, జగతి, బొరివంక, బల్లిపుట్టుగ తదితర గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు పలువురు రైతులు పెద్దపులి అడుగుజాడలను గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంబంధిత అధికారులు ఫారెస్ట్ రిసెప్షన్ ఆఫీసర్ ఆర్ రాఘవయ్య, పి రాజు, రెడ్డి, బీట్ ఆఫీసర్ రవి కుమార్, ఎఫ్ డీ ఓ సంతోష్ ఘటన స్థలాన్ని చేరుకొని పెద్దపులి అడుగుజాడలను పర్యవేక్షణలో గుర్తించి చుట్టుపక్కల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.పెద్దపులి ఉద్దాన ప్రాంతంలో తిరుగుతున్నదన్న సమాచారం తెలిసిన వెంటనే ఉద్దాన ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. పెద్దపులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు.

ఈనెల 31న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఈనెల 31న మంగళవారం శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల

కామ్రేడ్ కా. ఎన్.ఆర్ దాసరి క్రాంతి భవనంలో ఉదయం 10:00 గంటలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభ జరుపుటకు రాష్ట్ర రైతు సంఘం నాయకత్వం నిర్ణయించింది. కావున మీ ప్రాంతంలో గల రైతులను, రైతు సంఘం కార్యకర్తలు, నాయకులను పట్టుకొని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు భాధ్యతగా హాజరు కావాలని జిల్లా రైతు సంఘం కన్వీనింగ్ కమిటీ సభ్యులు చిక్కాల గోవిందరావు, గుడ్ల రామకృష్ణ, సింతు ఎర్రయ్యలు కోరారు.

సిరిపురంకు మద్దతు తెలిపిన పైడి సామాజిక సంఘం

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం గూనబద్ర ఆర్అండ్ఆర్ కాలనీ, రామకృష్ణాపురం గ్రామాల పైడి. సామాజిక సంఘం పాతపట్నం నియోజక వర్గం నాయకులు ప్రముఖ విద్యావేత్త సిరిపురం తేజేశ్వరావుకు తమ మద్దతు ప్రకటించింది. ఆదివారం ఈ సంఘం ప్రతినిధులు గొర్లే యకాసి, గంట శాంతారావు, నీలపు యారకయ్య, నీలాపు రాజులు సిరిపురం ను కెంపు కార్యాలయంలో కలిసి గ్రామ సమస్యలతో పాటు తమ సామాజిక వర్గం సమస్యలను వివరించారు.రానున్న ఎన్నికల్లో మీ వెంట మేము అని పైడి కుల. సామాజిక సంఘం నాయుకులు ప్రకటించారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలటీలో స్వప్న లాడ్జిలో ఢిల్లీకు చెందిన రాజ్‌పుతే నరేష్ (25) యువకుడు ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ఈ నెల 26వ తేదీన స్వప్న లాడ్జిలో గది అద్దెకు తీసుకొని తాను టైల్స్ వ్యాపారం చేస్తానని చెప్పి దిగాడు. 27వ తేదీ సాయంత్రం నుంచి మృతుడు కనిపించకపోవడంతో 28వ తేదీ ఉదయం లాడ్జి యాజమాని గిరిబాబు కిటికీ తలుపులు తెరిచి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించడంతో లాడ్జి యాజమాని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్.ఐ ఖాదర్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్.ఐ ఖాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు చేపట్టండి

విశాలాంధ్ర-జలుమూరు: ఖరీఫ్ లో రైతులు వేసిన పంటల వివరాలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదుపై ఈనెల 26 నుంచి 29 వరకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి అన్నారు. జలుమూరు మండలం లింగాలవలస రైతు భరోసా కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఈ-క్రాప్ నమోదు శతశాతం పూర్తి చేసినట్లు తెలిపారు. వ్యవసాయాధికారి కె. సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి కషాయలు తయారు చేస్తున్న రైతులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా నిమ్మతొర్లువాడ గ్రామం లో సిబ్బంది రైతులచేత కషాయాలను చేయిస్తున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నక్క చిరంజీవి మాట్లాడుతూ తూటికాడ కషాయాన్ని తయారుచేయించామని అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కషాయాలను పంటలో పిచికారీ చేయడం వలన పురుగులు, తెగుళ్ల నియంత్రణ బాగా అవుతున్నాయని తెలిపారు. రైతులు ఎంతో ఆసక్తితో కషాయాలను పిచికారి చేస్తున్నారని తద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది తిరుపతి, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్ పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం

విశాలాంధ్ర-రణస్థలం: మండలం నడికుదిటిపాలేంలోని చెరువులో ఒక మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని స్థానికులు జేఆర్ పురం పోలీసులసు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జేఆర్ పురం ఎస్సై రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం ఒల్లూరు గ్రామనికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. మృతుడు గడిచిన మూడు రోజుల క్రితం డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా చెరువులోకి అదుపుతప్పి వెళ్లి మృతి చెందినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండుకాళ్లు పొగొట్టుకున్న బాలికకు ఎంపీ లక్ష ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఈ యేడాది ఆగస్టు నెలలో స్కూల్ నుంచి ఇంటికి వెలుతూ రోడ్డు ప్రమాధంలో గాయపడి తన రెండు కాళ్ళను పొగొట్టుకున్న మండలం కురుదు గ్రామానికి చెందిన మెండ షర్మిళశ్రీకు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం సాయంత్రం లక్షరూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్నతనంలోనే తన రెండు కాళ్ళు పొగొట్టుకున్న చిన్నారి షర్మిళశ్రీకు అన్ని విధాల అదుకుంటానని, తనకు కృత్రిమ కాళ్ళును కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతానని, తను చదువుకొనేందుకు ప్రత్యేక చర్యలు చేపడతానని ఎంపీ భరోసా ఇచ్చారు. ఎంతో భవిష్యత్ ఉన్న షర్మిళశ్రీకు ఇలాంటి ప్రమాధం జరగటం చాలా బాదకరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అమె తల్లిదండ్రులు అప్పలనాయుడు, కృష్ణవేణిలకు కుటుంబ ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసు నాయులు మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామక్రిష్ణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, వెలమల కామేశ్వరరావు , గొండ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

హిందు ధర్మాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అన్ని ధర్మాలు కంటే హిందు ధర్మం గొప్పదని, ప్రతీ ఒక్కరు హింధుధర్మాన్ని, దీని యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవాలని ప్రవచన కారులు, పొందూరు గీతానందస్వామి, నరన్నపేట సిద్ధాశ్రమంకు చెందిన అనుష్టానందస్వామి, పర్లాఖిమిడికి చెందిన గణేష్ పట్నాయక్ స్వామిజీలు అన్నారు. మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామ శ్రీరామమందిరంలో ఆలయ ధర్మకర్త, భగద్గీత ప్రవచనకారులు సనపల కరుణ్‌కుమార్ ఆద్వర్యంలో జరిగిన సత్సంగ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శ్రీరామ మందిరంలో ప్రతి దినం భక్తి కార్యక్రమాలు జరపడం ఈ గ్రామం చేసుకున్న అదృష్టమని, ఇలాంటి దైవ కార్యక్రమాలు పుణ్యక్షేత్రలలో తప్ప మరెక్కడ జరగవని దీనిని గ్రామస్థులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఆలాగే కోటబొమ్మాళి ఆర్య సమాజం వారిచే ఉదయం 9 గంటలకు భక్తులచే గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు సత్సంగ సమావేశంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు సనపల రమణమ్మ, మెండ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

43 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- భావోద్వేగానికి గురైన పాత మిత్రులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: 43 ఏళ్ల విరామం తర్వాత టంగుటూరి ప్రకాశం మున్సిపల్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం స్థానిక నాగావళి హెూటల్ లో నిర్వహించారు. అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒరేయ్ ఒసేయ్ సంబోధనలతో వేదిక వేడుకగా మారింది. 1979, 1980 విద్యా సంవత్సరాల విద్యార్థిని విద్యార్థులు సంఘటితంగా ఏర్పడి అప్పట్లో తమకు విద్యా బోధనలు నేర్పిన నలుగురు గురువర్యులను ఆత్మీయంగా సత్కరించడం విశేషం. నరసయ్య శర్మ, బి సింహగిరి, కె ఎస్ ప్రసాద్, సీతా మహాలక్ష్మి మొదలగు నలుగురు టీచర్లను సన్మానించడం గర్వంగా భావించారు. ముందుగా ప్రార్థన గీతం, మా తెలుగు తల్లికి మల్లెపూదండ, ప్రతిజ్ఞలతో ప్రారంభమైన కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదభరకంగా జరిగింది. పాత మిత్రుల కలయికను సన్మాన గ్రహీతలైన టీచర్లు అభినందించారు. 43 ఏళ్ల విరామం తర్వాత జరిగిన ఈ అపూర్వ కలయికలో గురువులకు పాదాభిషేకం చేసి పుష్పాలతో పూజించి గురువుల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆ నలుగురు టీచర్లు సంతోషం వ్యక్తపరుస్తూ ఇలాంటి సమ్మేళనం మునుపెన్నడు చూడలేదని అభినందించారు. పాత విద్యార్థులందరూ వారు చేస్తున్న వివిధ హెూదాలతో సంబంధం లేకుండా కులమత రహితంగా ఒక్కటిగా వేడుక నిర్వహించడం ప్రశంసనీయం. ఒకరినొకరు పలకరించుకుంటూ ఎంతో ఆత్మీయంగా గడిపిన క్షణాలు ప్రతి ఒక్కరి హృదయాలలో హత్తుకున్నాయి. చిన్ననాటి జ్ఞాపకాల నమ్మరు వేసుకుంటూ ఆనాటి టీచర్ల బోధనలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: పూర్వ విద్యార్థుల కలయిక ఒక గొప్ప సమ్మేళనం. సాధారణంగా ఒక ఐదు నుంచి పది సంవత్సరాల మునుపటి విద్యార్థులు కలయిక విశేషంగా చెప్పుకునే ఈ రోజుల్లో, 10వ తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసి 40 సంవత్సరాలు గడిచిన తర్వాత కలయిక అంటే అది గొప్ప మధురనుభూతిని మిగులుస్తుందని చెప్పడంలో సందేహం లేదు. సరుబుజ్జిలి మండలంలోని చిన్న కాయితాపెల్లి జడ్పీ.హెచ్. స్కూల్లో ఎప్పటికప్పుడు పూర్వ విద్యార్థులు కలయిక జరుగుతుంటుంది. ఈసారి కిల్లి భువనేశ్వర్ రావ్ మరియు సిపాన శశిభూషణరావు ఆధ్వర్యంలో 1982 నుండి 1983 సంవత్సరం 10వ తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎక్కువగా ఉండడం విశేషం. ఇప్పటికే చాలామంది అమ్మమ్మలు తాతయ్యలు అయిపోయారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినటువంటి భువి మరియు శశిలకు సహా విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరంకు విశేష స్పందన

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామంలో గోనప సంతోష్ కుమార్ జన్మదిన సందర్భంగా జెమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోంపేట మహాలక్ష్మి నర్సింగ్ హెూమ్ వైద్యులు ప్రధాన శివాజీ, జేమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆదివారం బి గొణపపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో క్యాన్సర్, కిడ్నీ, గుండె, కీళ్ల సమస్యలు అన్ని రకాల సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 341 మంది రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 31 మంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పండి దేవేంద్రమూర్తి, ఎంపీటీసీ సభ్యులు ప్రియ కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు సర్వేశ్వరరావు, గొనవ అప్పలనాయుడు, పూడి రామారావు, ధనుంజయం యువజన సంఘ సభ్యులు,సంతోష్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రులకు సన్మానం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: 1997లో ఆంధ్రజాతీయ బిఈడీ కళాశాల మచిలిపట్నంలో చదువుకొని వేర్వేరు ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్న తన మిత్రులను విశ్వనాథం, అప్పన్న, లక్ష్మిబాయిలు ఆదివారం శ్రీకాకుళంలలో ఘనంగా సన్మానించారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉన్నత శిఖరాలు అధిరోహించి ఇటీవల పదోన్నతి పొందిన షణ్ముఖ మాస్టర్, రాజు మాస్టర్‌లకు, ఆలాగే కోటబొమ్మాళి సబ్‌ట్రెజరీ అధికారిగా పనిచేసి ఇటీవల డాక్టరేట్ పట్టా పొందిన జి. రాజులకు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 1998 డీఎస్సీ టీచర్ ఉద్యోగం పొందిన కె. రవిలను మిత్రులు విశ్వనాథం, అప్పన్న, లక్ష్మిబాయిలు సన్మానించారు.

జిల్లా ఆర్థిక కార్యదర్శిగా చలపాక రమణ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న చలపాక రమణను జిల్లా ఆపస్ ఆర్థిక కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆపస్ కార్యవర్గం నూతనంగా ఆదివారం ఎన్నికలు జరిగినట్లు జిల్లా ఆర్థిక కార్యదర్శి చెలపాక రమణ తెలిపారు. ఈ కార్యవర్గంలో ఆపస్ జిల్లా అధ్యక్షులుగా దుప్పల శివరామ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కీలు సోమేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఆపస్ ఉపాధ్యాయ సంఘంలో ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరము పోరాడుతూ వస్తున్న నేపథ్యంలో ఆపస్ సంఘం ఈ గుర్తింపునిచ్చిందని, మా ముగ్గురిని నియమించిందని ఆయన తెలిపారు. ఆపస్ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఆర్థిక కార్యదర్శిగా ఎన్నిక పట్ల మండలంలో పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

మృతుల కుటుంబ సభ్యులను గౌతు పరామర్శ

విశాలాంధ్ర-పలాస : మండలం రెంటికోట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు హెూరియ మోహనరావు పెద్ద నాన్న హెూరియా గోవిందు మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలాస నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గౌతు శిరీష పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు ఈమెతో పాటు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, పలాస మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

కళ్ళు తెరిపిద్దాం పేరుతో టీడీపీ వినూత్న నిరసన

విశాలాంధ్ర-కవిటి: తెదేపా అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆయనకు మద్దతు తెలుపుతూ కళ్ళు తెరిపిద్దాం పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకులు మండలకేంద్రమైన కవిటి మూడు రోడ్ల కూడలివద్ద ఆదివారం రాత్రి 7 గంటల ఐదు నిమిషాలకు కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన తెలియజేశారు.తెదేపా ప్రధాన కార్యదర్శి లోకేష్ పిలుపుమేరకు ఐదు కోట్ల మంది ఆంధ్రులు ఒకటిగా జగనాసుర చీకటి పాలనకు వ్యతిరేకంగా కళ్ళకు గంతలు కట్టుకొని నిజం గెలవాలని గట్టిగా నినదించాలని పిలుపు నిచ్చారని ఈ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్ట డం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పొందల కృష్ణారావు ,బి రమేష్, సంతోష్ పట్నాయక్, మణి చంద్ర ప్రకాష్, సంతోష్, రంగా రౌలో, బి సురేష్, ప్రగడ మనిబాబు, ఆరంగి రాజు, పూడి ప్రవీణ్, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు భారతీయ జనతా పార్టీతో కలిసి రావాలి

బిసి మోర్చ మన్ కీ బాత్ రాష్ట్ర కన్వీనర్ వంజంగి వేణుగోపాల్

విశాలాంధ్ర-టెక్కలి : భారతదేశానికి ఒక బి.సి. అయిన నరేంద్ర మోదిని ప్రధానిని చేసిన భారతీయ జనతా పార్టీ తెలంగాణకి కూడా ఒక బిసిని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా సూర్యాపేట సభలో ప్రకటించడం పట్ల భారతీయ జనతా పార్టీకి, భాజపా జాతీయ అధ్యక్షులు జె.పి. నడ్డాకి ధన్యవాదాలు తెలియ జేస్తున్నానని భా.జ.పా. ఓ బి సి మోర్చ మన్ కీ బాత్ రాష్ట్ర కన్వీనర్ వంజంగి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలుగు రాష్ట్రాలలో బిసి రాజ్యాధికారాన్ని నిజం చేయనుందని తెలంగాణలో అత్యధిక సీట్లు బిసిలకు ఇవ్వడం ద్వారా బిజెపి బిసిల పార్టీగా నిలిచింది కావున తెలుగు వారందరూ బిజెపితో కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ బిజెపి ఒబిసి మోర్చా కోరుతున్నదని తెలంగాణలో తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమైనదని ఎందుకంటే మాట చెప్పి తప్పించుకోవడానికి భా.జ.పా ప్రాంతీయ కుటుంబ వారసత్వ అవినీతి పార్టీ కాదని,అంత్యోదయ లక్ష్యంతో పనిచేసే సాంస్కృతిక జాతీయవాద పార్టీ అని అందుచేత తెలుగు రాష్ట్రాలలో బిసి సమాజం మొత్తం ఏకమయ్యి బిజేపితో కలిసి వచ్చి రాజ్యాధికారం పొందాలని ఓ బి.సి కదలి రా!! బిసి ఆత్మాభిమానం వైపు పయనిద్దాం రా కదలి రా! అంటూ బిజెపి ఒబిసి మోర్చా ఆంధ్రప్రదేశ్ శాఖ పిలుపు- -నిచ్చింది. కావున తెలుగు రాష్ట్రాలలో బిసి సమాజం మొత్తం బిజెపిని ఆశీర్వదించి భారత ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలిచి రాజ్యాధికారం పొందాలని తెలుగు రాష్ట్రాల్లోని యావత్ బిసి సమాజం హర్షం వ్యక్తం చేస్తూ యున్నదన్నారు.

నిజమైన అభివృద్ధి వైకాపాతోనే సాధ్యం : ఎంపీపీ దాసు

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్రంలో నిజమైన అభి వృద్ధి వైకాపాతోనే సాధ్య మని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. సోంపేటలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీ వల టీడీపీ సమావేశం ఏర్పాటు చేసి వైకాపా నేతలపై విమర్శలు చేయడాన్ని డాక్టర్ దాసు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షంలో ఉంటూ అవినీతి అక్రమాలు బట్టబయలై ఏమి చేయాలో తెలియక వైకాపా నేతలపై విమర్శలు పెట్టుకోవడం టీడీపీ పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌళిక రంగాలకు సంబంధించి గణనీయమైన ప్రగతిని సాధించారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పరిపాలన పట్ల ఆకర్షితులై ఇటీవల ఇచ్ఛాపురంలో సామాజిక బస్సుయాత్ర సూపర్ సక్సెస్ అయ్యిందని అన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు తరలి వచ్చారని గుర్తు చేశారు. అక్రమాలు, అవినీతితో అడ్డంగా దొరికిన చంద్రబాబునాయుడు జైలుపాలు కావడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మోహనరావు, భాస్కరరావు, వెంకటరమణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతరం సేవా సమితి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం పెద్ద మురహరిపూరం సాగర్ కాలనీలో నివాసముంటున్న భద్రాచలం తారకేశ్వరరావు కు యువతరం సేవా సమితి సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం బాధితుడు ఇంటికి వెళ్లి రూ. 20 వేలు చెక్ అందించారు.బాధితుడు కొంత కాలంగా గుండెకు సంబంధించి విపరీతమైన ఆయాసం దగ్గు తో బాధపడుతున్నడు. ట్రీట్మెంట్ నిమిత్తం వైజాగ్లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్చారు.ఈయనకు గుండె ఆపరేషన్ చేసి సి. ఆర్. టి మిషన్ అమర్చాలని వైద్యులు తెలిపారు. సి ఆర్ టి మిషన్ అమర్చడం ఆరోగ్యశ్రీలో పరిధిలో రాదని వైద్యులు తెలిపారు. సి ఆర్ టి (కార్డియాక్ రిసెయింక్రోనైజేషన్ తెరఫీ) కి గాను సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో బాధితుడు యువతరం సేవా సమితినీ సంప్రదించాడు. ఈ కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత. మురళి, ఇంచార్జిలు గోరకల అశోక్,బడే దనుంజయ్, కోడి నిహాల్, గోరకల సునీల్, గోరకల శరత్, కలిశెట్టి సింహాచలం, తాలూరి మురళి,కంబాల దానేశ్ , బత్తిని లక్ష్మణ్, బత్తిని. గణేష్, బత్తిని నరేష్,ఆర్జి నాగేశ్వరరావు, నెమలపురి గణేష్,రత్నాల భాస్కరరావు, పాల్గొన్నారు.

ఓటు ఆయుధంతో వైసిపికి శిరచ్ఛేదనం తప్పదు

- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: అధికారాన్ని అడ్డం పెట్టుకొని విర్రవీగుతున్న వైసీపీకి ఓటు అనే ఆయుధంతో శిరచ్ఛేదం చేయడం తప్పదని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. అధిష్టానం పిలుపుమేరకు ఆదివారం గాంధీ విగ్రహం వద్ద కళ్ళకు గంటలకు కొట్టుకొని అధికార వైసీపీపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజం నిప్పులాంటిదని చంద్రబాబు అక్రమ అరెస్టులపై నిజం గెలుస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన ఓటు అనే ఆయుధంతో జగనా సుర వద తప్పదని తెలిపారు. స్కిల్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి 50 రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ ఒక్క ఆధారాన్ని ప్రభుత్వం, సిఐడి అధికారులు చూపించలేదని విమర్శించారు. అక్రమ కేసులు ఎన్ని బనాయించిన చివరకు నిజమే గెలుస్తుందని స్పష్టం చేశారు. కళ్ళకు గంటల కట్టి ప్రభుత్వ విధానాలు పై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంపద రావు మురళీధర్ రావు తమ్మినేని గీత, బొర గోవిందరావు, జీడి ప్రసాద్, బోయిన బాల, మాలిక్, నాగరాజు, తమ్మినేని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయంలో సంప్రోక్షణ పూజలు

విశాలాంధ్ర -జలుమూరు: మండలం శ్రీముఖలింగంలో వెలసి ఉన్న శ్రీ ముఖలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా ఆలయంలో శుద్ధి, సంప్రోక్షణ పూజలు చేశామని ఆలయ అర్చకులు తెలిపారు. సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులకు శ్రీ ముఖలింగేశ్వర స్వామి దర్శనం, ప్రత్యేక పూజలకు అవకాశం కల్పించామని ఆలయ అధికారి వివరించారు.

మూసివేసిన ఆర్అండ్‌బి కల్వర్ట్‌ను తెరిపించాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-కొత్తూరు : అలికాం. బత్తిలి రోడ్ లో పారాపురం కొత్తూరు మధ్యన ఉన్న మూసివేసిన కల్వర్టు ను తక్షణమే అధికారులు తెరియించడానికి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం. జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు.ఆదివారం ఇక్కడ మీడియా తో ఆయన మాట్లాడుతూ ఇలా కల్వర్టు మూసివేయడం వల్ల ఎగువ నుండి వస్తున్న మురికి నీరు ఏటు పోవడం లేదు దీనివల్ల దిగువనున్న వారు ఇబ్బందులు పడుతున్నారు ఈ సమస్య పై ప్రజలు నుండి అధికారులు కు వినతులు అంది నా పట్టించుకోవడం లేదు.అని వ్యవసాయ కార్మిక సంఘం నాయుకులు సి ర్ల ప్రసాద్ అన్నారు ఈ సమస్య పై సంబందిత అధికారులు స్పందించి మూసి వేసిన కల్వర్టు తెరిపించాలని లేకుంటే. ఆర్ అండ్ బి రోడ్‌పై బైటాయించి రాకపోకలు స్తంభిచిపోయాలా నిరసన తెలుపుతాము అని అన్నారు .

కోష్ట పంచాయతీలో కళ్లు తెరిపిద్ధాం

విశాలాంధ్ర-రణస్థలం : మండలం కోష్ట పంచాయతీలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిమిడి కళావెంకట రావు ఆదేశాలు మేరకు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు కు నిరసనగా కళ్ళకు గంతలు కట్టుకొని "కళ్ళు తెరిపిద్దాం" కార్యక్రమంలో రణస్థలం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి. భానోజీనాయుడు, పిషిణి జగన్నాథం నాయుడు, మండల నాయకులు పైడి అప్పాడదొర, ఎంపీటీసీ పిషిణి ఆశిరి నాయుడు, నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

గ్రంధాయంలో చదవడం మాకిష్టం

విశాలాంధ్ర-రణస్థలం: శాఖా గ్రంథాలయంలో ప్రతి ఆదివారం జరిగే చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా దినపత్రికల పఠనం, కథలు చదివించడం, జాతి నాయకుల జీవిత చరిత్రను చదివించడం జరిగింది. విద్యార్థులతో మాట్లాడుతూ మఱ్ఱి చెట్టు విత్తనంలో మహావృక్షం ఉన్నట్లుగా చిన్న కథలోనే మనకు జీవితంలో ఎదురయ్యే కోరికలు లక్ష్యాలు, ఆశయాలు, జీవన మార్గాన్ని నిర్దేశిస్తాయని తెలియజేశారు. తదనంతరం విద్యార్థులు క్యారమ్స్ ఆటల్లో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి కషాయాలు తయారీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం ఎచ్చెర్ల గ్రామం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో కషాయాలు తయారు చేయించారు. ఈ సందర్భంగా సిబ్బంది శ్రీదేవి, మీన, తులసి మాట్లాడుతూ రైతుల చేత యన్.పి.యం షాప్ వద్ద కశాయాలు, ద్రావణాలను తయారు చేయిస్తున్నమని తెలిపారు. ఆదివారం మునగాకు కషాయం తయారు చేయించామని అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పంటలను సాగు చేయడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారని ఎన్.పి.యమ్ షాపు వద్ద తయారు చేసినటువంటి కషాయాలను తీసుకెళ్లి పంటలో పిచికారి చేయిస్తున్నామని అన్నారు. యన్.పి.యమ్ షాప్ వద్ద పంటలకు అవసరమైన కషాయాలని నిల్వ ఉంచుతున్నామని అన్నారు.

ఉల్లి... ఘాటు

- కొండెక్కుతున్న ధరలు
- రూ. 20 నుంచి రూ. 100 దిశగా....
- ముందస్తు చర్యలు తీసుకుని ధర అదుపులో ఉంచాలని ప్రజల కోరిక

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఆహారంలో నిత్యం వాడుకునే ఉల్లిపాయ ధర క్రమేపీ పెరుగుతోంది. గత నెల క్రితం కేజీ రూ.20 ఉండగా.. ప్రస్తుతం కేజీ రూ.70కు చేరుకుంది. మరో వారంలో రూ.100కు ఉల్లి కేజీ ధర చేరుకునే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. సాధారణంగా కోటబొమ్మాళికి రోజుకు 10వ్యానులు ఉల్లి వస్తుండగా.. ప్రస్తుతం రెండు వ్యానులతో మాత్రమే వస్తున్నాయి. దీంతో పెరుగుతున్న ఉల్లి ధర పేద ప్రజల కంట నీరు తెప్పిస్తోంది. ఇక హెూటళ్లు, తినుబండారాలు, ఆహారాల దుకాణాల వారు ఉల్లి ధర పెరగడంతో వాటి వినియోగాన్ని తగ్గించారు. మొన్నటి వరకు కొండెక్కిన టొమాటో ధర తగ్గిందని ప్రజలు సంబరపడేలోపే ఉల్లి ధర పెరగడం పేద, మధ్య తరగతి ప్రజానీకానికి ఇబ్బంది కరంగా మారింది. మొన్నటి వరకు రూ. 20 పలికిన టొమాటో కేజీ ధర మళ్ళీ రూ. 60కు చేరుకుని చుక్కలు చూపిస్తుంది. సంబందిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ధరలను సిర్థీకరించాలని ప్రజలు కోరుతున్నారు. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని సామెత. ఉల్లిలో ఉన్న ఆహార, ఔషద విలువలు మానవుని శరీరానికి ఎంతో ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అందువలనే మన పూర్వీకుల నుంచి ఉల్లిపాయలు ఆహారాల్లో ప్రధానంగా వినియోగిం చేలా చూశారు. అయితే ప్రకోపం కలిగించే గుణం ఉల్లిలో ఉండడంతో దీక్షల సమయంలో, పూజల సమయంలో ఉల్లిని వినియోగించకూడదని శాస్త్రవచనం. అయితే ప్రతి ఒక్కరూ దాదాపు ప్రతి వంటలోనూ ఉల్లిపాయను వినియోగిస్తారు. సంవత్సరంలో ఏదో ఒక సమయంలో ఉల్లి ధర పెరగడం ప్రజల జేబులు ఖాళీ చేయడం మామూలే. మరలా కొత్త పంట రాగానే ధరలు మామూలు స్థాయికి వస్తాయి.

రూ. 20 నుంచి రు. 70కు చేరుకున్న కేజీ ధర : గత నెల రోజుల క్రితం బహిరంగ మార్కెట్లో కేజీ ఉల్లి ధర రూ.20లు మాత్రమే ఉంది. ఆంధ్రప్రదేశ్లోని ఉల్లి పండించే ప్రాంతాల్లో సరిగా దిగుబడి రాకపోవడం, ఉల్లి పాయకు ప్రధాన ఎగుమతిదారులైన మహారాష్ట్రలో ఇంకా పంట చేతికి రాకపోవడంతో డిమాండ్ ఏర్పడింది. శ్రీకాకుళం జిల్లాకు ప్రతిరోజూ 10 లారీలకు పైగా ఉల్లిపాయలు వస్తుంటాయని అంచనా.. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో రోజుకు 2 లేదా 3 లారీలు, మహా అయితే నాలుగు లారీలు మాత్రమే వస్తున్నాయి. దీంతో ఉల్లి ధరలకు రెక్కలు వచ్చాయి. కొత్తపంట చేతికి వచ్చే సమయం మరో నెలకు పైగా ఉన్నం దున రూ. 100చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. తెలంగాణలో త్వరలో ఎన్నికలు జరగనున్నందున పెరిగిన ఉల్లి ధర ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఉల్లిదారిలోనే పెరుగుతున్న టమాటా ధర : గత నెల క్రితం టొమాటో రికార్డు స్థాయిలో కేజీ రూ. 150 వరకు చేరుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. అయితే తిరిగి చేతికి పంట రావడంతో కేజీ రూ. 10 నుంచి రూ. 20కు చేరుకుంది. ఆ పాత్రను ప్రస్తుతం ఉల్లి స్వీకరించింది. క్రమేపీ పెరుగుతున్న ఉల్లిపాయ ధరకు తోడు టొమాటో కూడా బహిరంగ మార్కెట్లో కేజీ



రూ. 50కు చేరుకుంది. ఉల్లి కేజీ రూ. 100కు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్న అధికారులు నిత్యావసరాల ధరలను అదుపులో ఉంచాల్సిన పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారుల చందం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉం టోంది. ఓ వైపు ఉల్లిపాయ కానీ టొమాటో కానీ ధరలు పెరుగుతాయని ముందస్తు అంచనాలు ఉన్నప్పటికీ వాటి ధరలను స్థిరీకరించేలా సంబంధిత అధికారులు చర్యలు అధికారులు దాడులు ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వ్యాపారస్తులు బ్లాక్ మార్కెట్ చేసిన సమయంలో సంబందిత శాఖ అధికారులు ప్రభుత్వాలకు నివేదించి చర్యలు చేపట్టాల్సిన అవసరం కూడా ఉంది. అయితే మార్కెటింగ్ శాఖ తొలుత పట్టించుకోకుండా ఉండడం తీరా ధరలు పెరిగిన తర్వాత హడావుడి చేయడం మామూలు అయిపోయింది. ఇప్పుడైనా సరైన చర్యలు తీసుకుని ఉల్లి ధరలు స్థిరీకరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

50 ఏళ్ల తర్వాత అందరూ కలిసారు

విశాలాంధ్ర-సోంపేట : ఎప్పుడో దశాబ్దాల క్రితం చిన్నపిల్లలుగా కలిసి చదువుకుని సరదాగా గడిపిన ఆ విద్యార్థులంతా ఎక్కడెక్కడో స్థిరపడినప్పటికి అందరం కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని వారంతా ఆదివారం సోంపేటలో ఒక వేదికపైకి చేరి ఒక అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 1968-69 విద్యా సంవత్సరంలో సోంపేటలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రస్తుతం వారంతా 60 ఏళ్లు పైబడినప్పటికి ఇప్పటికైనా ఒక చోట అందరం కలుసుకుని సరదాగా నాటి విశేషాలను గుర్తు చేసుకోవాలన్న కుతుహలంతో సోంపేటలో గల చౌడేశ్వరి కళ్యాణ మండపంలో గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బి.సన్యాసిరావు, కామేశ్వరరావు, రుషికేశ్వరరావు, చిరంజీవరావు, కె.మోహనరావు, ఆర్.రాజబాబు, మహిమారావు తదితరులంతా కలిసి పలు రాష్ట్రాల్లో పలువురు స్థిరపడినప్పటికి అందరినీ ఒకే వేదిక వద్దకు రప్పించడంలో సఫలీకృతమయ్యారు. వారంతా దశాబ్దాల క్రితం కలిసి మెలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఎంతో సంబరపడ్డారు. కొంత మంది చిన్ననాటి మిత్రులను చూసి బావోద్వేగానికి గురయ్యారు. ప్రతి వ్యక్తి జీవితంలో మంచి స్నేహానికి మించినది మరొకటి లేదని అన్నారు. చిన్నవయస్సులో మనందరి మధ్య బీజం పడిన స్నేహానికి గుర్తుగా మళ్లీ ఇన్ని దశాబ్దాలకు ఒకే చోట అందరం కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి మిత్రుడు జీవిత చరమాంకం వరకు స్నేహపూర్వకంగా కొనసాగుదామని అన్నారు. మంచి స్నేహం మనోధైర్యానికి ప్రతీక అని పేర్కొన్నారు.